క్లుప్తంగా

లక్ష్మణ్ కుమార్ త్వరగా కోలుకోవాలని పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్ననాయకులు

పెగడపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ త్వరగా కోలుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం పూజలు చేశారు. పెగడపల్లి శివాలయంలో స్వామి వారికి అభిషేకం జరిపించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మెన్ శ్రీనివాస్, నాయకులు రాములుగౌడ్, తిరుపతి, భాస్కర్ శ్రీధర్‌రావు, మల్లారెడ్డి, వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి ప్రజాసంఘాల జేఏసీ నాయకుల సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

మల్లాపూర్: మండల ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్సై కిరణ్‌కుమార్‌ను ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్, జిల్లా అధ్యక్షుడు బొనగిరి మల్లారెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు సుతారి రాజేందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పడాల జలేందర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పెద్దిరెడ్డి, లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖకు ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల ప్రజలు సంపూర్ణంగా సహాయ సహకారాలను అందించాలని కోరారు.

సీనియర్ సిటిజన్లకు టాస్కా అండ



మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

కోరుట్ల: సీనియర్ సిటిజన్లకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అండగా ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డివిజన్ శాఖ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వయో వృద్ధులను విస్మరించే వారు శిక్షార్హులేనన్నారు. సీనియర్ సిటిజన్స్ కేసులను ఆర్డీవో సోమ రాజేశ్వర్ త్వరగా పరిష్కరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పబ్బా శివానందం, రాజ్ మోహన్, లక్ష్మీనారాయణ, సైఫొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ట్రస్మా కార్యవర్గం



జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంతను సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు

జగిత్యాలరూరల్: ట్రస్మా జగిత్యాల జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంతను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు, జనరల్‌సెక్రటరి మహదేవ్, ట్రెజరర్ కృష్ణప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పొలాలు పరిశీలన

ఇబ్రహీంపట్నం: యాసంగిలో వరిపైర్లకు పిలుక దశలోనే కాండం తొలిచే పురుగు ఉధృతంగా వస్తుందని దీని నివారణకు రైతులు తగిన చర్యలు చేపట్టాలని ఏవో దీపిక రైతులకు సూచించారు. మండలంలో వరి పంటలకు సోకిన మొగిపురుగు పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది యాసంగిలో కాండం తొలిచే పురుగు ఉధృతితో రైతులు చాలా నష్టపోయారన్నారు. ఇప్పుడు కూడ మొగిపురుగు ఉధృతంగా ఉందని, దీని నివారణకు రైతులు వెంటనే ఆయా గ్రామాల వ్యవసాయ శాఖ అధికారులను కలిసి వాటి నివారణకు వెంటనే పిచికారి మందులను వాడాలని తెలిపారు. అలాగే పీఎమ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా కొంత మంది రైతులు కేవైసీ చేయించుకోలేదని, ఈ నెల 21 వరకు వెంటనే రైతులు కేవైసీ చేయించుకోవాలని తెలిపారు.



బండలింగాపూర్ పెద్దచెరువు



తూము దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీరు

ప్రతిపాదనలకే పరిమితం..!

- దెబ్బతిన్న బండలింగాపూర్ పెద్దచెరువు తూము
- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- వృథాగా పోతున్న నీరు
- ప్రతిపాదనలు పంపినా మంజూరు కాని నిధులు

మెట్‌పల్లిరూరల్: భూగర్భజలాలను పెంచేందుకు ప్రభుత్వం కాల్వల ద్వారా చెరువుల్లో నీటిని నింపేందుకు చర్యలు చేపడుతున్నప్పటికీ ఫలితంలేకుండా పోతుంది. కాల్వలతో చెరువులను నింపుతున్న అధికారులు చెరువులకు సంబంధించిన తూములకు మరమ్మతులు చేపట్టే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ పెద్దచెరువును నింపేందుకు అధికారులు ప్రతి ఏటా వరదకాల్వలోని నీటిని తరలిస్తున్నారు. కానీ పెద్దచెరువు తూము దెబ్బతినడంతో దాని నుండి నీరు వృథాగా పోతుంది. దీంతో గ్రామస్తులు, రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పెద్దచెరువు కింద 600 ఎకరాల ఆయకట్టు..

బండలింగాపూర్ పెద్దచెరువు కింద సుమారు 600 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. అంతేకాకుండా మేడిపల్లి,రాజేశ్వర్‌రావుపేట,వెల్లుల గ్రామాల రైతులకు చెందిన వందలాది ఎకరాల పంట పొలాలున్నాయి. ఈ చెరువులో నీరు సమృద్ధిగా ఉంటే సుమారు నాలుగు గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. అలాగే సమీప ప్రాంతంలో ఉన్న బోర్లు,బావులు ఎండిపోకుండా ఉండే అవకాశం ఉంది. కానీ చెరువులోని నీరు వృథాగా పోతుండడంతో భూగర్భజలాలు పడిపోయి సాగు నీటికి, తాగునీటికి ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అలాగే తూము దెబ్బతినడంతో చివరలో ఉన్న వ్యవసాయ భూములకు నీరు అందడంలేదు. దీంతో బావులు,బోర్లు ఉన్న రైతులు వాటిపై ఆధారపడి సాగు చేస్తుండగా,మిగతా రైతులు యాసంగిలో పంటలు వేయకుండా ఖాళీగా వదిలేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

బండలింగాపూర్ పెద్దచెరువు తూముకు సంబంధించిన మరమ్మతులపై ప్రతిపాదనలు పంపించాం. కానీ ఇంకా నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరైతే వెంటనే మరమ్మతులు చేపడుతాం.

– అరుణ్, డీఈ ఇరిగేషన్, మెట్‌పల్లి

తూమును పట్టించుకోకుండా..

గతంలో చేపట్టిన మిషన్ కాకతీయ-1కు బండలింగాపూర్ పెద్దచెరువును ఎంపిక చేసిన అధికారులు మరమ్మతులు చేయించారు. కానీ చెరువులోని నీటి వృథాకు కారణమైన తూమును ఏ మాత్రం పట్టించుకోకుండా మరమ్మతులు చేపట్టలేదు. ఆ సమయంలో తూము దెబ్బతిని ఉన్నప్పటికీ అధికారులు దానిపై దృష్టి సారించలేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇప్పటికైనా తూము మరమ్మతులు చేపట్టి వృథాగా పోతున్న నీటికి అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గీత కార్మికులను ఆదుకుంది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



రేణుకా ఎల్లమ్మతల్లి ఉత్సవాల్లో ఎమ్మెల్యే

రాయికల్: గీత కార్మికులను ఆదుకుంది బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆరే నని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కిష్టంపేటలో మంగళవారం రేణుకా ఎల్లమ్మ పట్నాలు, అన్నదానం పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ హయాంలో గీత కార్మికుల అభ్యున్నతి కోసం సంఘ భవనాలు, ఎల్లమ్మతల్లి కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేశామని, ఈత, తాటిమొక్కలు నాటామని గుర్తుచేశారు. ధర్మపురి ఎక్సైజ్ సర్కిల్ నుంచి రాయికల్ మండలాన్ని జగిత్యాలకు మార్చామని గుర్తుచేశారు. అంతేకాకుండా గీత కార్మికులకు 50 ఏళ్లకే రూ.2 వేల పెన్షన్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వరూప, ఎంపీటీసీ సారిక గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో పట్టణ అభివృద్ధి

- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి: మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేణి సుజాత అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన వార్షిక బడ్జెట్ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.18.89 కోట్ల అంచనాతో రూపొందించిన మున్సిపల్ బడ్జెట్ ఆమోదం పొందింది. సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బోయిని చంద్రశేఖర్‌రావు, కౌన్సిలర్లు హాజరయ్యారు. 18.89 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన బడ్జెట్‌ను మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించిందని కమిషనర్ మోహన్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ మెట్‌పల్లి పట్టణాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సమావేశంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రత్యేక సమావేశం స్థానిక మున్సిపల్ భవనంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సర బడ్జెట్‌కు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కమిషనర్ తిరుపతి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

ఇబ్రహీంపట్నం : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త తండ్రాల ప్రసాద్ కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందగా, బాధిత కుటుంబానికి మంజూరైన రూ. 2 లక్షల బీమా చెక్కును మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, ఆదుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, నాయకులు రాజాగౌడ్ పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మంగళవారం పర్యటించారు. వెల్లుల, జగ్గాసాగర్, కొండ్రికర్ల, కోనరావుపేట గ్రామాల్లో పర్యటించిన ఆయన 20 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సాయిరెడ్డి,స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

ఇబ్రహీంపట్నం: ఇంటర్ విద్యార్థులు డిగ్రీ చదువులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేరాలని కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి, అర్థశాస్త్రం సహాయ ఆచార్యులు కె. వెంకయ్య కోరారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎ,బీకాం కోర్సులువిద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుభవం, అర్హతలు గల ఉపన్యాసకులు ఉన్నారని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యాబోధన ఉంటుందన్నారు. ఇంటర్ ఫలితాల్లో హెచ్‌ఈసీలో అత్యధిక మార్కులు పొందిన ఇర్ఫాన్, సీఈసీలో అత్యధిక మార్కులు సాధించిన శ్రేయకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలన

కథలాపూర్: మండలంలో ఉపాధిహామీ పథకం పనులకు మంగళవారం 972 మంది కూలీలు హాజరైనట్లు ఏపీవో రాజేందర్ తెలిపారు. జిల్లాలో సగటున 51 శాతం కూలీలు ఉపాధిహామీ పనులకు హాజరు కావడం విశేషమని ఉన్నతాధికారులు ఏపీవో రాజేందర్‌ను అభినందించారు. వేసవికాలంలో ఉపాధిహామీ పనులకు కూలీల హాజరుశాతం పెంచేందుకు కృషి చేస్తామని ఏపీవో అన్నారు.

సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ

కథలాపూర్: మండలంలోని సిరికొండలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దొప్పల హైమావతి, నాయకులు పాల్గొన్నారు.

వెల్లటూర్ మండల కేంద్రంలో..

వెల్గటూర్: మండల కేంద్రంలోని దుబ్బలవాడలో రూ. 15 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి స్పెషల్ ఆఫీసర్ శేఖర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. నిధుల మంజూరుకు సహకరించిన ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేరుగు మురళి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సందీప్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కూల్చివేసిన గుడిసెలకు నష్ట పరిహారం ఇప్పించాలి

కోరుట్ల: పట్టణ శివారులోని జంబిగద్దె ప్రాంతంలో గల సర్వే నెంబర్ 923 ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలు, ఇండ్లను ప్రభుత్వం ఈ నెల 16 వ తేదీన తొలగించిందని వారికి నష్ట పరిహారం ఇప్పించాలని అఖిల పక్షం ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు చిన్నా విశ్వనాథం, సుతారి రాములు, చింత భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశం వాయిదా వేయాలి

జగిత్యాల: ఈనెల 23న నిర్వహించనున్న మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేయాలని 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 28న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఉందని, అలాగే 24 లోపు కౌన్సిలర్లకు నోటీసులు ఇవ్వడం జరుగుతుందని, అంతేకాకుండా సమ్మక్క, సారక్క జాతర ఉందని, జాతరకు అందరు వెళ్లే అవకాశం ఉందని, వాయిదా వేయాలని కోరారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి

మెట్‌పల్లి: మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులకు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం జీతాలను వెంటనే చెల్లించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి అన్నారు. మెట్‌పల్లిలో మంగళవారం మాట్లాడారు.ఈ సందర్భంగా నెలల తరబడి జీతాలు రాకపోవడంతో వారంతా తీవ్రంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే వారికి వేతనాలను చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని తెలిపారు.

ధర్మపురి వాసికి బెస్ట్ ప్రెసిడెంట్ పురస్కారం



ప్రెసిడెంట్ పురస్కారం అందుకుంటున్న రామకృష్ణ

ధర్మపురి: లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా 2022-23 సంవత్సరంలో అత్యున్నతమైన సేవలందించినందుకు గుర్తుగా ధర్మపురి వాసి డాక్టర్ రామకృష్ణకు బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ క్లబ్ ఫర్ సర్వీసెస్ పురస్కారాన్ని అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పురస్కారోత్సవంలో గవర్నర్లు హన్మండ్ల రాజరెడ్డి, రెక్కల నారాయణరెడ్డి చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు.

రాయికల్‌లో భీష్మ ఏకాదశి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న గంగపుత్ర సంఘం సభ్యులు

రాయికల్: పట్టణంలోని గంగపుత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి భీష్మ ఏకాదశి సందర్భంగా గంగపుత్రులు భీష్ముని పతాకాన్ని ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తోపారపు రవీందర్, కౌన్సిలర్ కల్లెడ సునీత, యువజన సంఘం అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, ఫిషర్‌మెన్ అధ్యక్షుడు సురేశ్, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పాలన

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మల్యాల: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.1.50కోట్ల విలువైన అభివృద్ధి పనులు, సీసీరోడ్ల నిర్మాణాలకు మంగళవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.అంతకుముందు ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి జాతర



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న అర్చకులు

కోరుట్ల రూరల్: మండలంలోని గుమ్లాపూర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ దర్మకర్తలు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెగడపల్లి:మండలంలోని లింగాపూర్‌లో శ్రీలక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా భగవత్ పుణ్యాహవచనం, అంకురారోహణం, అగ్నిప్రతిష్ఠ, హోమం, బలిహరణం, ధ్వజారోహణం, స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం తదితర పూజా కార్యక్రమాలు ఆలయ పూజారీ కుర్మాచలం నరేశ్ ఆధ్వర్యంలో శాస్త్రోపేతంగా నిర్వహించారు. ఉత్సవాల నిర్వాహకులు, ఆలయ కమిటీసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణానికి ముస్తాబైన మల్లికార్జున స్వామి ఆలయం

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేశాపూర్, కొజన్ కొత్తూర్ గ్రామాల్లో ఈ నెల 24న మల్లిఖార్జున స్వామి కల్యాణానికి ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాలను రంగురంగులతో తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ నెల 24న కల్యాణం, 25న రథోత్సవం, 26 రాత్రి నాగవెల్లి, తెల్లవారు జామున అగ్నిగుండం అనంతరం జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కోరుట్ల రూరల్: ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు కాంట్రాక్టర్లకు సూచించారు. మండలంలోని అయిలాపూర్, పైడిమడుగు, జోగిన్‌పెల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను కృష్ణారావు పరిశీలించారు.నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజం, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మల్లాపూర్: గ్రామాల్లో సంపూర్ణ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్ల పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులతో గ్రామాల్లో ప్రగతిని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మైస లక్ష్మి, సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు కొత్తపల్లి రాజరెడ్డి, రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఎల్లాల రాకేశ్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎంచిరాల చిన్నారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు హంగామా





రాయికల్, మల్లాపూర్ మోడల్ స్కూల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో సెకండ్ ఇయర్ విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ ఇంటర్ మీడియెట్ విద్యార్థులకు ఎంతో కీలకమైందని, కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన డ్యాన్స్‌లు పలువురిని ఆకట్టుకున్నాయి.

మల్లాపూర్: పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆలీమొద్దిన్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు, గేమ్ షోలుఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మోడల్ స్కూల్ అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ పథకం సద్వినియోగం చేసుకోవాలి

ధర్మపురి: పీఎం కిసాన్ పథకంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన రైతులకు కేంద్రం ప్రతీ ఏడాది రూ.6 వేలు మూడు విడతలుగా అందిస్తుందని తెలిపారు.ఈ పథకానికి అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాలు, ఆధార్ సీడ్ ఉన్న రైతులు నేరుగా సదరు బ్యాంకుకు వెళ్లి ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని లేదా పోస్టాఫీస్‌లో కొత్తగా ఖాతా తెరవాలని సూచించారు.

ఆల్యానాయక్ తండాలో బోగుబండార్

రాయికల్: మండలంలోని ఆల్యానాయక్ గ్రామంలోని శివనాయక్ తండాలో సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా మంగళవారం బోగుబండార్ కార్యక్రమం నిర్వహించి బంజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నందునాయక్, నాయకులు గంగ్యానాయక్, మహేశ్‌నాయక్, రమేశ్‌నాయక్, సురేందర్ నాయక్, పంత్‌నాయక్, తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం చింతలపేట గ్రామంలో భూవివాదంలో ఒకరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు. మండలంలోని చింతలపేట గ్రామానికి చెందిన అడెపు మహేశ్ 2021 సంవత్సరంలో బద్దం శ్రీనివాస్‌రెడ్డి వద్ద 23 గుంటల భూమిని కొనుగోలు చేశాడు. కానీ భూమికి సంబంధించిన హద్దులు చూపించలేదు. గ్రామంలో పలుమార్లు పంచాయితీలు నిర్వహించారు. దీంతో రెండునెలల క్రితం మహేశ్ హద్దులు ఏర్పాటు చేసుకున్నాడు. హద్దులు ఏర్పాటు చేసుకోవడాన్ని జీర్ణించుకోలేని శ్రీనివాస్‌రెడ్డి, సదరు భూమిలో వరిపంట సాగు చేశాడు. మహేశ్ గడ్డి నివారణ మందులు చల్లాడు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 19న రాత్రి మహేశ్‌పై పెట్రోల్ చల్లి నిప్పంటించే ప్రయత్నం చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.